# శిల్పగా మారిన శిల

రచన :
శ్రీ. కంగర్ల నరసింహమూర్తి.

దూరం నుండి క్షణక్షణానికీ దగ్గరవుతున్న సంగీతం తీయగా వినిపిస్తూ ఉంది పెళ్ళికూతురైన భవానీకి. నాదస్వరం విద్వాంసుడు కల్యాణీ రాగాన్ని వాయిస్తూ అథితుల్ని ఆనందింపజేస్తున్నాడు. సంగీతం, ఇంటిని మరింతగా సమీపిస్తూ ఉంటే పెళ్ళికొడుకు అతని పరివారం ఆ సంగీతంతోనే ఇంటిని చేరుకుంటున్నారని భవానీకి తెలుసు. ఎందుకో తెలియని భయంతో ఆమె హృదయం దడదడ లాడింది.

తొందరగా లేచి, తన సన్నని వ్రేళ్ళతో ముంగురులను సద్దుకుంది భవానీ. గదిలో ఉన్న అద్దం ముందు నిలబడి తన ప్రతిబింభాన్ని చూసుకుంది. అలా చూసుకోవటం అప్పటికి నూరోసారి. కళ్ళు జిగేల్ మనిపించే బంగారు లేసుతో కూడన పెద్ద అంచుకల ఖరీదైన చీర భవానీ శరీరాన్ని అలంకరించి ఉంది. బంగారు దారంతో అక్కడక్కడ కుట్టబడిన నక్షత్రాలు గదిలోని లైటు కాంతిపడి చీర మీద మిలమిల మని మెరుస్తున్నాయ్. ఆమె ధరించిన గులాబీరంగు చోళీ ఆమె శరీర కాంతితో కలిసిపోయింది. వజ్రాలు పొదగబడిన బంగారు నగలెన్నో ఆమె మెడలో నిండుగా ఉన్నాయ్. ఆ గదిలో అప్సరసలా ఉంది భవానీ.

ఆనాడు ఆమెకు వివాహం కాబోతూ ఉంది. పెళ్ళికొడుకు మూర్తి ముందు, తనెంతో అందంగా కనిపించాలని, తన శాయశక్తులా ప్రయత్నించి అలంకరించుకుంది. భవానీ గదిలోనికి వస్తున్న చల్లని గాలికి చెదిరిన తన వంకీల జుత్తును సరిజేసుకుంది.

"భవానీ.! అలంకారం పూర్తయిందా!" అంటూ భవానీ చెల్లెలు సరోజ ఆ గదిలోనికి వచ్చింది. సరోజ చేతిలో, పెద్ద పూలదండ ఉంది. పెళ్ళికొడుకు వచ్చేస్తాడక్కయ్యా! అదుగో బేండు వినిపించడంలా? అంటూ సరోజా, భవానీ వంక చూసి ఎంతో సంతోషంతో "అబ్బా! నువ్వెంత అందంగా ఉన్నావక్కయ్యా! మూర్తిబావ నిన్ను చూసీ చూడ్డంతోనే, తన హృదయాన్ని తప్పకుండా పోగొట్టుకుంటాడు!" అంది.

భవానీ, సరోజ బుగ్గను మెల్లగా గిల్లి "ఛీ! పోకొంటె పిల్లా!" అంది మెల్లిగా నవ్వుతూ.

పురోహితులు మంత్రాలను పఠిస్తూ హోమాగ్నిలో ఆజ్యం పోస్తున్నారు. అకస్మాత్తుగా మంత్ర పఠనాన్ని ఆపి "ఆ అలస్యం అవుతుంది. శుభముహూర్తం సమీపిస్తూ ఉంది. పెళ్ళికూతుర్ని తీసుకురండి" అన్నారు పురోహితులు.

ఆమాట వినీవినడంతోనే సరోజ, భవానీ గదిలోనికి పరుగెత్తుకొని వెళ్ళి ఆమె మెడలో పెద్ద పూలహారాన్ని వేసి "ఈ ఒక్క ఛాన్సు నాకు దక్కనీ అక్కయ్యా! ఇక ముందు ఈ చక్కని చుక్క మెడలో పూలహారాలు వేసే భాగ్యమంతా శ్రీమూర్తిగారిదేగా!" అంటూ ఫకాలున నవ్వి సిగ్గుతో తలవంచుకొని పెదవులపై చిరునవ్వు చిందిస్తున్న భవానీని కల్యాణ వేదిక దగ్గరకు తీసుకు వెళ్ళింది.

పవిత్రమైన మాంగల్యాన్ని పదిమంది పెద్దల ఎదుటా భవానీ మెడలో కట్టాడు మూర్తి. నాధస్వర సంగీతం శిఖరాల నందుకుంది. వచ్చిన అథితులు, బంధువులు, చిలకా గోరింకల్లా కనిపిస్తున్న వధూవరులను చూసి, ఎంతో ముచ్చటపడుతూ పది కాలాలపాటు ఆ దంపతులు వర్ధిల్లాలని ఆశీర్వదిస్తూ, నూతన వధూవరులపై అక్షంతలు జల్లారు.

భవానీ మెల్లగా తల ఎత్తి, తన జీవిత భాగస్వామి వంక ఎంతో సంతృప్తిగా చూసింది. అదే క్షణంలో మూర్తికూడా, భవానీని తేరిపారి చూసాడు. గర్వంగా చిరునవ్వు నవ్వి, తిరిగి తన చూపు మరల్చుకున్నాడు. ఆ చూపులో, నవ్వులో ఎన్నో అర్థాలున్నాయ్. ఆ చూపులోని భావమేమిటో ఆ గర్వమైన నవ్వులోని అంతర్యమేమిటో భవానీకి అర్థం కాలేదు. ఒక్క క్షణంపాటు ఆమె శరీరం జలదరించింది. ఏదో నీరసం ఆవరించింది. ఎందుకలా అయిందో మాత్రం ఆమెకు తెలియటంలేదు.

భవానీ హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. నేటి అమ్మాయిలకు మల్లేకాక, భవానీ పెళ్ళికాక ముందు భర్త ముఖాన్ని చూడనేలేదు. అతడు విదేశాలకు వెళ్ళి చదువుకొని వచ్చాడని, బొంబాయిలో ఒక పెద్ద కంపెనీలో మంచి జీతానికి పని చేస్తున్నాడని వినగానే, అత

నిని ప్రత్యక్షంగా చూసి, మంచి అందగాడని తెలుసుకుంది. వధువుకు అంతకంటే వేరే అదృష్టం ఇంకేం కావాలి?

మూర్తికి సెలవులేని కారణంగా, నూతన దంపతులు ఆ మర్నాడే బొంబాయికి ప్రయాణం కావలసి వచ్చింది. భవానీ దుఃఖపూరితమైన హృదయభారంతో, కన్నీటితో తన బంధువుల దగ్గర సెలవు తీసుకుంది. రైలు కదిలింది.

అది మొదటి తరగతి కావటంవల్ల ఆ కంపార్టుమెంటులో ఆ దంపతులు తప్పించి, ఇంకెవ్వరూ లేరు. రైలు పరుగెత్తుతుంటే, వెనక్కు పోతున్న చెట్లు చేమలు కిటికీలోనుండి చూస్తూ దీనంగా కూర్చుంది భవానీ. అది గమనించిన మూర్తి "ఏం భవానీ! అమ్మా నాన్నలను విడిచిపెట్టి, ముక్కూ మొఖం ఎరుగని నా దగ్గరకు వచ్చేస్తున్నందుకు బాధగా ఉందా!'' అన్నాడు.

భవానీ లేని చిరునవ్వును తెచ్చిపెట్టుకొని "అబ్బే! లేదండీ! నా జీవితంలో ఇంతకు ముందెప్పుడూ ఇంత ఆనందంగా లేను. తల్లిదండ్రులకు దూరం కాబోతున్నాను గదా అని, స్త్రీని కాబట్టి మనస్సు కొంచం మదనపడుతూ ఉంది. అంతే!'' అంది.

మూర్తి ఒక్క క్షణంపాటు నిశ్శబ్దంగా మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత అతడొక రూపాయి నాణాన్ని తన పర్సులోనుండి తీసి, భవానీ అరచేతిలో ఉంచాడు.

"దీన్ని నీకు తిరిగి ఇచ్చేద్దామని నాలుగేళ్ళనుండీ ఎదురు చూస్తున్నాను భవానీ!'' అన్నాడు మూర్తి. భవానీ ఆశ్చర్యంతో మూర్తి వదనంలోనికి తొంగి చూసింది. "మీరన్నదేమిటో నాకు అర్థంకాలేదు'', అంది.

మూర్తి ఫకాలున నవ్వి "ఏం భవానీ! ఇంతకుముందెప్పుడూ నువ్వు నన్ను చూడనేలేదా? కొంచం ఆలోచించు. నాలుగేళ్ళ క్రితం జరిగిన ఒక ఆకస్మిక సంఘటన నీకు గుర్తులేదా? టాటా ఇన్‌స్టిట్యూట్ దగ్గర్లో నీ కారు టైరొకటి చెడిపోవటం వగైరా, వగైరా! జ్ఞాపకం తెచ్చుకో డార్లింగ్!'' అంటూ అతడు ఒక్క క్షణం ఆగి, ఆమె గతస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకోవడానికి అవకాశం ఇచ్చాడు.

భవానీ ఆలోచించసాగింది. అవును! నాలుగేళ్ళ క్రిత ఆనాడు అది సాయంకాలం ఆరుగంటల వేళ. చలికాలం కాబట్టి అప్పటికి చాలా చీకటయింది. భవానీ ఒక స్నేహితురాలి పుట్టినరోజు పార్టీకి వెళ్ళి, తిరిగి వస్తుండగా మధ్యదారిలో తన కారు టైరొకటి పంచరయింది. ఉసూరుమని కారులోనుండి దిగి, ఒక్కసారి చుట్టూ కలియ జూసింది. రోడ్డుమీద అసలు జనసంచారమే లేదు. భవానీ భయంతో వణికిపోయింది. పది నిముషాల తర్వాత ఆ దారి వెంటనే వస్తున్న యువకుడొకడు ఆమె కంట పడ్డాడు. అతడు శుభ్రంగా ఉన్న దుస్తులనే వేసుకున్నాడు గానీ, కానీ అవి అక్కడక్కడ చిరిగిపోయి, మాసికలుపడి అతని పేదరికాన్ని చాటుతున్నాయ్.

దీనంగా విచారంగా కారు దగ్గర నిలబడ్డ భవానీ దగ్గరకు వచ్చి "నేను మీకేమైనా సహాయం చెయ్యగలనా?'' అంటూ ఆ యువకుడు ఆ టైరు స్థితిని గమనించి, భవానీ జవాబు కోసమైనా ఎదురు చూడకుండా శరవేగంగా పనిచేసి, టైరు మార్చాడు.

ఉన్నవారి కుటుంబంలో పుట్టి అల్లారు ముద్దుగా పెరిగిన భవానీ, చిన్నప్పటినుండీ తల బిరుసు మనిషి. పైగా పేదరికమంటే తెలియని ఆమెకు పేదవాళ్ళంటే బొత్తిగా సానుభూతి లేదు. ఎప్పుడైతే కారు టైరు బాగుపడిందో వెంటనే ఆమె కారులో కూర్చొని, యువకుని దగ్గరకు ఒక రూపాయి నాణేన్ని కారులో నుండి విసిరి, కారు స్టార్టు చేసింది. కారు రివ్వున ముందుకు దూసుకుపోయింది. ఆ చీకటిలో ఆ నిర్జన ప్రదేశంలో, చెడిపోయిన తన కారు టైరును మార్చిన ఆ యువకుడు తనకెంతో సహాయం చేశాడనిగానీ, అతని కృతజ్ఞత చెప్పుకోవడం తన ధర్మమనిగానీ, ఆ పొగరుబోతు పిల్లకు తట్టలేదు. కారు నడుస్తుండగా, వ్యూ మిరర్‌లో కనిపించిన అస్పష్టమైన ఆ యువకుని ముఖాన్ని చూచాయగా, అనుకోకుండా చూడవలసి వచ్చింది పాపం భవానికి!

భవానీ తృళ్ళిపడి తన భర్త ముఖాన్ని చూసింది. అవును! ఆనాడు తన కారు టైరు మార్చిన యువకుని ముఖం తన భర్త ముఖం ఒక్కలాగే ఉన్నాయ్. ఎవరినైతే తాను ఆనాడు నిర్లక్ష్యంగా అవమానించిందో

ఆయనే ఈయనలా ఉన్నాడు. ఆనాడు అతని వదనంలో పేదరికపు ఛాయలు స్పష్టంగా కనిపించాయి. కానీ ఈనాడా వదనంలో ఆత్మ విశ్వాసం, ఐశ్వర్యమంతమైన హుందా తన జ్యోతుల్లా మెరుస్తున్నాయ్. సందేహంలేదు. ఆనాటి పేద యువకుడే నేడు తనకు పతియైనాడు.

“డియర్ భవానీ! ఆనాడెప్పుడో జరిగిన సంఘటన, నేటికి కూడా, నా కళ్ళకు గట్టినట్టే ఉంది. అందువలనే ఎప్పుడైతే మీ అన్నయ్య నీ ఫోటో చూపించాడో, వెంటనే మారు మాట్లాడకుండా, నిన్ను పెళ్ళి చేసుకోడానికి నేను అంగీకరించాను. నీ కొక గుణపాఠం నేర్పించాలని నా ఆశయం. నన్ను చూడకుండా, కనీసం నా ఫోటోనైనా చూడకుండా నువ్వు నన్ను పెళ్ళిచేసుకోడానికి అంగీకరించావని తెలియగానే, నేనసలు ఆశ్చర్యపడలేదని నీకు తేలుసా? నాకు తెలుసు భవానీ! నీకా హోదా కావాలి. ఐశ్వర్యం కావాలి. అవి నీకు చాలు ఇప్పుడు అవి నా దగ్గర పుష్కలంగా ఉన్నాయ్. అందుకే మారు మాట్లాడకుండా నన్ను కట్టేసుకున్నావ్! అవునా భవానీ డార్లింగ్! అంటూ మూర్తి ఫకాలున నవ్వి, కొద్దిగా మిగిలిన సిగరెట్టును, లేచి కిటికీలోనుండి బైటకు విసరి వేసాడు.

భవానీ మూగదానిలా కూర్చొని, ఏం మాట్లాడాలో తోచక, చేతి రుమాలును వ్రేళ్ళకు చుట్టుకుంటూ, భర్తవంక చూడలేక సిగ్గుతో తలవంచుకుంది.

నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ‘చూడు భవానీ! ఒకొక్కప్పుడు నేను అనుకొనేవాణ్ణి ‘ఎంత ధనవంతులైనా సరే, పాపం వారికికూడా హృదయంలో దయాదాక్షిణ్యాలు, సానుభూతీ ఉంటాయని - కానీ వాళ్ళదగ్గరుండే డబ్బు మూటలు గర్వంగా మారి, హృదయంలోని మంచిగుణాలను ఒకమూలకు నెట్టివేస్తాయ్. కానీ అవకాశం కలిగితే, ఆ గర్వాన్ని అవతలకు నెట్టి, హృదయాన్ని పునీతం చెయ్యడం ఏమంత కష్టమైనపని కాదనుకుంటాను. ఆ హృదయాలను జాలితోను, మర్యాదతోను నింపుకోవడం కూడా చాలా సులభమనుకుంటాను’ అంటూ మూర్తి ఆమె కళ్ళలోనికి చూస్తూ, వాటిలో కలుగుతున్న మార్పును చూసి చాలా సంతోషించాడు.

భవానీ హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. కన్నీళ్ళతో ఆమె రెండుకళ్లూ నిండిపోయాయి. దీనంగా భర్తవంక చూసింది. ఆ క్షణంలో భవానీని చూడగానే మూర్తి హృదయం ద్రవించిపోయింది. ప్రేమతో భవానీని దగ్గరకు తీసుకుని, ఆమె కురులను నిమురుతూ ‘పిచ్చి భవానీ: ఈ లోకంలో పేదవాళ్ళకు కూడా ఆత్మగౌరవంగల హృదయాలుంటాయని నీకు తెలియదా? అవమానం జరిగితే పేదవాళ్ళు కూడా లోలోన దుఃఖిస్తూ కుమిలిపోతారని తెలుసుకోలేవా? ఈ లోకంలో పేదవాళ్ళకు కూడా తెలివితేటలున్నాయ్. అవకాశం ఇస్తే వాళ్ళు కూడా అతి సులభంగా అభివృద్ధిలోనికిరాగలరు. నిజం చెప్పాలంటే నేను మొదటితరగతిలో పాసై, విదేశాలకు వెళ్ళడానికి స్కాలరుషిప్పు సంపాదించకపోతే ఈనాడు నీకిలా నీతిని నేర్పించడానికి నాకు అవకాశం కలిగిఉండేది కాదు’ అంటూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు మూర్తి. కొసవరకు కాలినసిగరెట్ వ్రేళ్ళకు చురుక్కున తగలగానే మూర్తి తిరిగి ఈలోకంలోనికి వచ్చాడు.

భవానీ చెక్కుతూ, మూర్తి హృదయంమీద తన వదనాన్ని ఆన్చి ‘నన్ను క్షమించండి’ అంతే! దుఃఖావేశంలో ఆమె అట్టే మాట్లాడలేకపోయింది. ఆమె మనస్సిప్పుడు కడిగినముత్యంలా ఉంది.

‘చూడండీ! కఠినశిలనైనా సరే చెక్కితే చక్కని శిల్పంగా మారుతుంది. ఇంతకుముందు నా హృదయం వట్టి శిలమాత్రమే! మీ చక్కల మాటలతో ఆ రాతి రూపాన్ని మార్చి, చక్కని శిల్పంగా మార్చారు. నాలుగేళ్ళక్రితం మీరు నా హృదయంలో చూసిన మాలిన్యం ఈనాడు పూర్తిగా తొలగిపోయింది. ఇప్పుడు నేను పూర్తిగా మారిపోయాను. మంచికిగల విలువ తెలుసుకున్నాను.

అలా మాట్లాడుతూనే, ఆమె ఒకనాటి తన గర్వాన్ని తలచుకొని సిగ్గుపడింది. మూర్తిచేతిలోని సిగరెట్టులా, ఆమెలోని అహంభావమంతా పూర్తిగా కాలి మసైపోయింది. పనికిరాని సిగరెట్టును మసిని మూర్తి విదిలించినట్లే, ఆమె తనలోని దుర్గుణాలను పూర్తిగా విదలించివేసింది.

తన అరచేతులో మెరుస్తున్న రూపాయి నాణాన్ని కళ్ళకు అద్దుకుంటూ ఈ ‘రూపాయిని నా జీవితాంతం దాచుకుంటాను, అణకువసిరిసంపదలకంటే విలువైనదని, అణకువ లేని సిరిసంపదలు, దేవుడులేని దేవాలయం లాంటివని, ఈ రూపాయి నాకు బోధించింది’ అనుకుంది భవాని.

ఆమెలోని మార్పును గమనించిన మూర్తి సంతృప్తిగా నవ్వుకున్నాడు,

రైలుమాత్రం ఇవేవీ గమనించకుండా, తన దారిన తాను పరుగులు తీస్తూఉంది.